# గైడ్

హడావిడిగా కంపార్టుమెంటులోకి ఎక్కాను.

వరంగల్ నుండి కృష్ణా ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది. జేబులను తడుముకుని చూచుకున్నాను మరోసారి. డబ్బు పదిలంగానే ఉంది. జాగ్రత్తగా టికెట్‌ను బయటికి తీసుకుని సీట్ నెంబర్ చూచుకున్నాను. నలభై ఆరు. కిటికీ ప్రక్కన సీటు. చిన్న పిల్లవానికి మిఠాయి పొట్లాం దొరికినంత సంతోషమైంది. కిటికీ దగ్గర కూర్చుని బయటికి—పరుగెత్తె ప్రకృతిలోకి చూస్తూ అలా ఎన్ని గంటలైనా కూర్చోవడమంటే నాకెంతో యిష్టం.

నేను ఓ జనరల్ అండ్ ఫ్యాన్సీ షాప్‌లో మేనేజర్ కం గుమాస్తాగా పని చేస్తున్నాను. ఓ నాల్గువేల రూపాయలను నా కిచ్చి హైద్రాబాద్ వెళ్ళి దుకాణానికి కావలసిన వస్తువులను కొనుక్కురమ్మని పంపాడు మా సేఠ్.

రాత్రి ఎనిమిదింటికి హైద్రాబాద్ చేరుకునే కృష్ణా ఎక్స్‌ప్రెస్ గురించీ, నేను ఉండాల్సిన లాడ్జింగ్ గురించీ, రేపు షాపింగ్ చేయాల్సిన కంపెనీల గురించీ, ఖర్చు చేయాల్సిన డబ్బు వివరాల గురించీ ఆలోచిస్తూ ఉన్నాను.

"షో—" అన్న అరుపు వినబడింది. బిగ్గరగా నా ప్రక్కనే. ఉలిక్కిపడి చూశాను తలత్రిప్పి.

అప్పటినుండే నా ప్రక్కనున్న సీట్లలో ఉన్న ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతూండడం నాకు తెలుసు. నేను రైలు ఎక్కేముందే వాళ్ళు మాంచి ఫాంలో ఉన్నారు. నేను ఆ ఆటగురించి అప్పటినుండి అంతగా పట్టించుకోలేదు. గాని ఆ అరుపు విన్న తర్వాత పరిసరాలను పరిశీలించి చూద్దునుగదా, మా వరుసలో కూర్చున్న మనుషులందరూ ఆ ఆటను ప్రత్యేకాసక్తితో గమనిస్తున్నారు.

నాకూ ఆట తెలుసు. 'షో'— అని, సూట్ కేస్‌పై కార్డ్సును పరుస్తున్న వ్యక్తివంకా, చూపించిన డిస్‌క్లోజ్ వంకా చూశాను. షో కరెక్టే. అతను విజయగర్వంతో చాలా హుషారుగా ఓ కింగ్ సైజు గోల్డుఫ్లాక్ సిగరెట్టును వెలిగించి పొగను గాలిలోకి ఊదాడు విలాసంగా.

మిగతా యిద్దరు కార్డ్సును ముందరపడేసి పాయింట్స్‌ను లెక్కపెడుతున్నారు. లెక్కపెట్టడమైపోయింది.

ఒకతను ఎనభై రెండు రూపాయలు, యింకొకతను ముప్పయి ఆరు రూపాయలు తీసి యిచ్చారు షో చూపించిన వ్యక్తికి. అతను రూపాయలను గుప్పిట్లో ఎంతో నిర్లక్ష్యంగా పట్టుకుని, జేబులో కుక్కుకుని మళ్ళీ కార్డ్సును కలుపుతున్నాడు.

నాకు ఒళ్ళు జల్లుమంది. ఒక్క టర్న్‌లో - ఎనభై రెండు రూపాయలు- ఓ గాడ్. ఎనభై రెండు రూపాయలు అంటే .... దాదాపు నా జీతంలో సగం

స్టేక్ ఎంతనో-మొత్తానికి ఘోరంగా ఉంది వాతావరణం, మనసు నిండా ఆతురత సముద్రంలా అరుస్తోంది.

నా ఎదురు సీట్లో కూర్చున్న నాలాంటి ప్రేక్షకుని దిక్కు ప్రశ్నార్థకంగా చూశాను. స్టేక్ ఎంత అన్న భావం ధ్వనించేలా. అతను

నాలు ప్రేళ్ళనూ తర్వాత ఎనిమిది వేళ్ళనూ చూపించాడు, సింబాలిక్‌గా. ఫోర్ రూపీస్-యైట్ రూపీస్.

నా ముఖంపై చెమట పట్టింది వెంటనే. అంతపెద్ద మొత్తాలపై పేకాడుతుండగా యిదివరకు నే నెన్నడూ చూడలేదు. నా ఆలోచనలన్నీ గాలికెగిరిపోయిన కాగితాల్లా ఎక్కడో మాయమైపోయినై. చూపులు దిగబడిటోయెటొబాల్లా వాళ్ళ దిక్కు పొడుచుకుపోతున్నాయి.

పంచిన కార్డ్సును మళ్ళీ చేతుల్లో తీసుకున్నారు ముగ్గురూ నా ప్రక్కనున్న మనిషే ఇంతకు ముందు ఎనభై రూపాయలు క్షవరం చేయించుకున్నాడు. కొద్దిగా వంగి అతని కార్డ్సులోకి చూశాను. ఒక్క సీక్వెన్స్ కలువలేదు. పోనీ టచ్చింగ్ కార్డ్సు కూడా లేవు. పేపర్ జోకర్స్ గేమ్, జోకర్ రాలేదు.

నాకున్న పేకాట అనుభవం ప్రకారం ఆ ఆటను వెంటనే డ్రాప్ చెయ్యాలి లేకుంటే హెవీ కౌంట్‌లో పడిపోయే ప్రమాదముంది. కాని అతను కార్డు కట్ చేసి ఆట ప్రారంభించాడు.

ఆ క్షణంలో "వీడో ఫూల్" అన్న ముద్ర ఏర్పడింది నాకు అతనిపై.

ఓ పదికార్డ్సు కట్ అయిపోయాయి. అదే ఆటనై నా వెనకాముందు ఆలోచించకుండా ఆడుతున్నాడు ఆవేశంగా అనవసరమైన ముక్కలను ఉంచుకుంటున్నాడు. పనికొచ్చేవాటినీ-ఎదుటి మనిషికి అవసరమయ్యే ముక్కలను తెంచేస్తున్నాడు.

క్రమంగా అతనిపై కోపం, జాలీ కలుగడం ప్రారంభమైంది నాలో, నాకు తెలియకుండానే.

మళ్ళీ యింతకు ముందు షో చేసిన మనిషే మళ్లా ఆట చూపిం

చాడు. నా ప్రక్కనున్న వ్యక్తిదగ్గర కోకొల్లల పాయింట్సున్నాయి. లెక్కబెట్టి వ్యవహారం తేలుస్తే నూట ఎనిమిది రూపాయలైంది. యింకొకతను ఇరవై నాల్గు రూపాయలను వదులుకున్నాడు.

నాకంతా కలలోని సంఘటనలా అనిపిస్తోంది. మెదడంతా తిమ్మిరి పట్టినట్టు మొద్దుబారిపోయింది. ఆదే మనుషులను పరిశీలించి చూశాను నిశితంగా. "షో" చేస్తున్న మనిషి చేతులకు బంగారు ఉంగరాలతో, బంగారు రంగు గడియారంతో, ఖరీదుబట్టలతో నోట్లను గాలిలో ఊదే మనిషిలా ఉన్నాడు. మిగతా యిద్దరూ అతనంత డిగ్నిఫైడ్‌గా లేకపోయినా మామూలు మనుషుల్లామాత్రం లేరు.

యింత డబ్బుతో ఆడుతున్న వీళ్ళు ఏం పనిజేస్తారో, ఎలా సంపాదిస్తారో యింత మొత్తాన్ని? యింత డబ్బు పోతూంటే వాళ్ళ మనసు ఎలా ఫీలవుతుందో. చూస్తున్న నాకే యింత దడగా ఉంటే, వాళ్ళకెలా ఉండి ఉంటుంది-ఆలోచిస్తున్నాను.

యింకో రౌండ్ కార్డ్సు పంచారు. మళ్ళీ ఆట ప్రారంభమైంది. నా ప్రక్కనున్న మనిషి ఆటరాని ఫూల్ అన్న అభిప్రాయం పూర్తిగా ధృవపడింది.

యింకో ఆట .... యింకో ఆట ... యింకో ఆట .... నోట్లు రెక్కలు కట్టుకుని ఎగురుతున్నాయి, జేబులోనుండి జేబులోకి.

కాలం పరుగెత్తుతోంది తన్నిన బంతిలా. రైలు పరుగెత్తుతోంది విడిచిన బాణంలా.

పేకాట చుట్టూ వాతావరణం స్తంభించిన ప్రకృతిలా గంభీరంగా వుంది.

అంతా ఆవేశం...ఆవేశం...ఆరాటం-ఆరాటం. ఉత్సుకత.... ఆసక్తి....దడదడ.

నా ప్రక్కనున్న మనిషి జేబునుండి నేను చూస్తుండగానే వెయ్యి రూపాయలకు పైగా మాయమైపోయాయి. యీ లోగా చూస్తూ కూర్చున్న వాళ్ళలో నుండి యింకొకతను కూడా ఉత్సాహంతో ఆటలోనికి దిగాడు. దిగి తనూ ఓ రెండు మూడు వందలు సంపాదించుకున్నాడు. నా ప్రక్కనున్న పూల్ దగ్గర నుండే అందరూ డబ్బు చేసుకుంటున్నారు.

రైలు భువనగిరి దాటింది. చీకటిపడింది, ఎప్పుడో. కాని ఎవరికీ బయటి ప్రపంచంలో ఏం జరుగుతుందో జ్ఞాపకమున్నట్టు లేదు. కంపార్టుమెంటు నిండా ఓ కొత్త ప్రపంచం నెలకొంది.

కార్డ్సు నవ్వుతున్నాయి నా ముందర. నోట్లు మెరుస్తున్నాయి నా ముందర. బరువుగా, వెచ్చగా ఉంది నా జేబు. ఏదో ఆవేశం... ఏదో ఉత్సాహం ఏదో తహతహ—

నేను కూడా ఆడితే–గుండెలు కొట్టుకుంటున్నాయి వేగంగా.

అందరూ డబ్బు సంపాదిస్తున్నట్టు నేను కూడా ఆ పూల్ నుండి నా వంతును పొందితే–పొందాలి .... పొందాలి. ఆడాలి ... ఆడాలి ... ఆడాలి.

ఆశ పొంగించిన ఆవేశం వరదలా ముంచుకొస్తోంది—ఆట నడుస్తోంది. యీ రౌండ్ అయిపోయాక జాయినై తే.

కాని తను దురదృష్టవశాత్తు డబ్బును పోగొట్టుకుంటే–ఆ డబ్బు ఎవరిది–ఆ డబ్బుతో ఆడే అధికారం తనకెక్కడిది?

డబ్బు పోతే.... తన గతి–ఓహ్.... నరకం.... నరకం .... ముఖం నిండా చెమట .... చెమట. మనసంతా ఘర్షణ ... ఘర్షణ. ఆడాలి .... వద్దు...ఆడాలి...వద్దు తొక్కిసలాట.

ఎదురుగా నవ్వేముక్కలు...నోటు.

ఆశ కాలుతున్న పెట్రోల్‌లా మండుతోంది. బలహీనత మత్తులా అవరిస్తోంది. ఆ రౌండ్ కానీ-తర్వాత చూద్దాం. ఎందుకో జేబు తడుముకున్నాను. 'షో' ఐంది. పూల్‌కు మళ్ళీ తిరుక్షవరమే ఐంది. ఎనభై రూపాయలు. పూల్ ఎనభై యిచ్చేసి ... ఖాళీ అయి-మిగిలిన రెండు మూడు రూపాయలున్న జేబును చూచుకుని...తలెత్తి-సిగరెట్టు వెలిగించుకుని...

ఆతని ముఖమంతా చెమట కారుతోంది. కళ్ళనిండా భయం.... వణుకు....ఆందోళన. మనిషి అదిరిపోతున్నాడు.

అతను లేచి....చుట్టు అందరివంకా నెమ్మదిగా, సిగ్గు పడుతున్నట్లుగా చూచి బాత్ రూం దిక్కు వెళ్ళిపోయాడు. వెళ్తూ "కార్డ్సు వేయండి" అన్నాడు. నేను కూడా "నాకూ వేయండి" అని అందామనుకున్నాను.

యింతలో....

బయట ఓ భయంకరమైన చావుకేక వినబడి...రైలు తలుపు దడదడ కొట్టుకుంటున్న చప్పుడు వినబడి—ఏమైంది ... ఏమైంది. ఎవరో చెయిన్ లాగినట్టున్నారు రైలు ఆగింది.

అందరూ గబగబా కార్డ్సును దాచేసి బయటికి పరుగెత్తి-చీకటి.... అంతా చీకటి. దిగి పరిగెత్తి చూస్తే....

ఇప్పటిదాకా నా ప్రక్కన కూర్చుని పేకాడిన మనిషి .... రక్తం మడుగులో బోర్లాపడిపోయి ... తలపగిలి ... ఒళ్లు చితికి, భయంకరంగా...ఎర్రగా.... అంతా నెత్తురు...నెత్తురు.

నాకంతా పిచ్చి పిచ్చిగా.... భయంగా ఉంది. ఇంతకు ముందు బ్రతికున్న మనిషి... యిప్పుడు చచ్చి.

జనం గుమికూడి చూస్తున్నారు. చుట్టంతా చీకటి.

సికింద్రాబాద్ స్టేషన్‌కు ఓ ఐదారు మైళ్ళ దూరంలో ఉన్నట్టున్నాం. గార్డ్ వచ్చాడు. ఏదో ఎంక్వయిరీ ... రైల్వే వాళ్ళు మా డబ్బాలోని వాళ్లను అడుగుతున్నారు. అతని గురించి ఏవేవో.

"ఇప్పటిదాకా యిక్కడే కూర్చున్నాడండీ గంభీరంగా...యిప్పుడే వెళ్ళి యీ ఘోరాన్ని చేసుకున్నాడు" అని చెప్పారు అందరూ. పేకాట సంగతి ఎవరూ చెప్పలేదు.

అంతా ఐపోయి ట్రైన్ బయలు దేరింతర్వాత ... "అతనిది మా విజయవాడేనండీ, నిజానికి అతను బీదవాడే. వాళ్ల షావుకారు డబ్బిచ్చి బొంబాయికి పంపినట్టున్నాడు పర్చేజింగ్‌కు. పాపం ఆవేశంలో నాలుగువేలు పోగొట్టుకున్నట్టున్నాడు ... తేరుకుని ఆలోచించుకుంటే భయమేసినట్టుంది -" యింకా చెబుతున్నాడు నా ఎదుట కూర్చున్న మనిషి.

నాలో ఆలోచనలు కాలుతున్నాయి, మండుతున్న కాగితాల్లా. నా ఒళ్లంతా చెమట... చెమట.

ఇక ఆరోజు తర్వాత పేకాడుదామన్న ఆలోచన ఎన్నడూ నా బుర్రలోకి రాలేదు.